# శంకర్‌దాదా జిందాబాద్!



**మా**కాలనీ పేరు మీకు తెలుసుకదా!

మా కాలనీ అంటే నా ఉద్దేశ్యం నిజంగా మా సొంతకాలనీ అనికాదు.

మేమంతా ఆ కాలనీలో అద్దెకుంటున్నాం. ఆ కాలనీ ఇళ్ళ ఓనర్లందరూ వేరే ఎక్కడో సొంత ఇళ్ళల్లో ఉంటున్నారు. వాళ్ళకు సొంతిళ్ళు లేవని హౌసింగ్ బోర్డువాళ్ళు వాళ్ళ కోసం కట్టించిన కాలనీలో మేము అద్దెకుంటున్నాము.

ఆ రోజు అదివారం అవడం వల్ల ఉదయం ఎనిమిది గంటల వరకూ హాయిగా నిద్ర పోవచ్చని నేను ప్లాన్‌చేశాను. ఎందుకంటే నిద్ర అనేది తెలుగు రాజధానిపౌరులకు రేషన్‌లో దొరికే మంచినీళ్ళలాంటిది.

ఎందుకంటే రాత్రి పన్నెండింటివరకూ ఆ చుట్టుప్రక్కల గుడిలోనో, మసీదులోనో లౌడ్ స్పీకర్లలో పాటలూ, అరుపులూ కేకలూ వినబడుతూనే ఉంటాయ్. అంచేత అంతవరకూ గ్యారంటీగా ఎవరికీ నిద్రవుండదు. పోనీ పన్నెండు తర్వాతే పడుకుందామా అంటే, మా కాలనీ నల్లాల్లో నీళ్ళు రాత్రి ఒంటి గంట నుంచీ రెండింటి వరకూ మాత్రమే వస్తాయ్.

"పోనీ రెండింటికి పడుకోవచ్చుకదా- దానికింత రాద్ధాంతం ఎందుకట?" అని మీరు విసుక్కోవచ్చు.

కానీ రెండింటికి కూడా పడుకోవడానికి వీల్లేదు. ఎందుకంటే రెండింటి నుంచీ మూడున్నర వరకూ మన ఆంధ్రప్రదేశ్‌లో దొంగలుపడే టైము. రోజూ ఆ టైములో మనింట్లోనో, పక్కింట్లోనో లేదా కాలనీలో ఏదోక ఇంట్లో దొంగలు పడక తప్పదుకదా! మరి ఆ దొంగలు అలా ఊడ్చుకెళ్ళి పోయాక మనం నలుగురినీ పిలవడం- లేదా నలుగురూ మనల్ని పిలవడం- అందరూ కలసి ఆ దొంగతనం గురించి మాట్లాడుకోవడం- జోకులేసుకోవడం- జరుగుతుంది కదా! ఇక నాలుగ్గంటలకు పాలవాన్ వచ్చేస్తుంది.

అయిదు గంటల్లోపల పాలపాకెట్ తెచ్చుకోకపోతే- ఆ తరువాత దొరకదు. మనపాకెట్‌ని మరోపావలా ఎక్కువ ధరకు ఎవరికో అమ్మేస్తాడు బూత్‌వాడు. లేదా ఆ పాకెట్‌లోనిపాలు కొన్ని తీసేసి నీళ్ళు కలిపేస్తాడు.

"పోనీ నాలుగున్నరకు పడుకోవచ్చు కదా, మాయరోగమా?" అని మీరనవచ్చు కానీ సరిగ్గా నాలుగున్నరకే పనిమనిషి తలుపులుకొడుతుంది. ఆమె టైము నాలుగున్నర నుంచీ అయిదు వరకూ. ఆ అరగంటసేపూ అంట్లు ఎగిరి పడటం, దొర్లడంలాంటి శబ్దాలు ఎవరాపగలరు? పోనీ ఆ పనిమనిషిని అరున్నరకు రమ్మందామా అంటే- "నేను నాలుగున్నరయితేనే వస్తాను! ఇష్టంలేకపోతే రిజైన్ చేస్తాను" అని వార్నింగిస్తుంది. అంచేత అయిదింటివరకూ నిద్రఖాళీ!

ఆ తరువాత వంటచేసే కార్యక్రమం ప్రారంభమయిపోతుంది. అప్పుడే న్యూస్‌పేపర్.

ఇవాళ పేపర్లో ఏమీరాశారో చూద్దాం అనే కోరిక నిద్రను పూర్తిగా తరిమేస్తుంది. ఇక అరింటికి లేచి రెడీ అవడం ప్రారంభిస్తేగానీ ఎనిమిదింటికి యింట్లోనుంచి బయటపడటం సాధ్యంకాదు. ఎనిమిదింటి నుంచి బస్‌స్టాప్‌లో ఆంధ్రప్రదేశ్ వారి ఆర్.టి.సి.బస్ కోసం పడిగాపులు పడితేగాని తొమ్మిదిగంటలకు బస్సు దొరకదు. తొమ్మిదింటి నుంచీ గంటన్నరపాటు అది చీమలా వేగంగా ప్రయాణిస్తేగానీ మన రాజధాని ట్రాఫిక్‌లో పదికిలోమీటర్ల దూరం వెళ్ళలేదు కదా!

కనుక అదివారం ఒక్కరోజుమాత్రమే కరువుతీరా నిద్రపోయేందుకు ఎక్కువ అవకాశాలున్నాయ్.

అయితే ఆ రోజు అరింటికల్లా తలుపులు గట్టిగాబాదడం వినిపించేసరికి అప్పుడేపడుతున్న నిద్రకాస్తా ఎగిరిపోయింది.

ఎవరా తలుపింత భీకరంగా, యింతపొద్దున్నే బాదుతున్నారని చిరాగ్గాలేచి వెళ్ళి తలుపు తెరిచాను.

ఎదురుగ్గా శాయిరామ్ నిలబడి వున్నాడు.

"హలో– గుడ్‌మాణింగ్!" అన్నాడు నవ్వుతూ.

"గుడ్ మాణింగ్!" అన్నాను కోపంగా.

"మన కాలనీలో ఎనిమిదింటికి మీటింగుంది"అన్నాడు చిరునవ్వుతో.

నాకు వళ్ళుమండిపోయింది.

"మొన్నేకదా దొంగల తాలూకు మీటింగయింది?" అన్నాను చిరాగ్గా.

"అవును."

"అప్పుడు వాళ్ళూ మనం ఓ అగ్రిమెంటుకొచ్చేం కదా!"

"అయ్యాయిగానీ– ఇప్పుడు మన నియోజకవర్గం నుంచి గెలిచిన కాంగ్రెస్ (డబ్ల్యూ) అభ్యర్థి ఆత్మహత్య చేసుకున్నాడు. అందుకని బై ఎలక్షన్–"

"అరె! ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడట?"

"తప్పక మనిష్టర్ అవుతాడని ఉన్న ఆస్తంతా ఖర్చుచేశాడట! తీరాచూస్తే మంత్రి పదవి దొరకలేదు. ఉట్టి ఎమ్మేల్యేగా ఉంటే ఖర్చు చేసినదానికి పదింతలే సంపాదించే అవకాశం ఉంటుందట! ఇంకేం చేస్తాడు పాపం!"

"అయితే ఇప్పుడు మనం మీటింగ్ ఎందుకు పెట్టుకోవాలి?"

"ఎందుకేమిటి? ప్రతి ఎలక్షన్‌కి మనకాలనీ వాళ్ళందరంకలిసి మీటింగ్ పెట్టుకుని ఏ పార్టీకి ఓటువేయాలో నిర్ణయించుకోవడం మామూలేగా?"

"ఇంకా నిర్ణయించుకునేది ఏముంది? మన కాలనీ ఎప్పుడూ కాంగ్రెస్ (డబ్ల్యూ) కేగా వోటువేసేది?"

"కానీ ఈసారి కొత్తపార్టీ వచ్చింది కదా? అందుకని మళ్ళీ ఓసారి డిస్కస్ చేసుకుంటే..."

"కొత్తపార్టీ ఏమిటి?" ఆశ్చర్యంగా అడిగాడు.

"కాంగ్రెస్ (జెడ్)"

"కాంగ్రెస్ జడ్డా?"

"అవును!"

"అంటే ఈ కాంగ్రెసుల్లో అదే అఖరిదన్నమాట! దీంతో ఇంకపార్టీ చీలేందుకు అవకాశం లేనట్లేగా!"

"ఎందుకులేదూ?"

"ఎందుకేమిటి? ఇంగ్లీష్‌లిపిలో జెడ్ వరకేగా ఉంది."

శాయిరామ్ నవ్వేడు.

"పిచ్చివాడా? రెండక్షరాలతో మళ్ళీ కొత్తసిరీస్ మొదలు పెట్టవచ్చుగా?"

"నాకర్థం కాలేదు"

"అంటే?"

అంటే కాంగ్రెస్ (ఎ–బి), కాంగ్రెస్ (జడ్–హెచ్) అలా లక్షల కొద్ది కాంబినేషన్లతో బోలెడు పార్టీలు ఏర్పాటు చేసుకోవచ్చు."

"నిజమే" ఒప్పుకున్నాను.

"అయితే పద త్వరగా మరి. ఎనిమిదింటికల్లా మీటింగ్ మొదలెట్టాలి."

వారానికోరోజు దొరకే ఈ రేషన్ నిద్రని వదులుకోవడానికి నాకు మనసొప్పలేదు.

"నాక్కొంచెం పనివుంది గురూ! మీరు మీటింగ్ స్టార్ట్ చేసేయండి. తరువాత వస్తాను" అన్నాను అబద్ధమాడేస్తూ.

"అదేం కుదరదు. కాలనీ కమిటీ వైస్ ప్రెసిడెంట్ వయ్యుండి నువ్ రాకపోతే అందరూ గొడవచేస్తారు."

"సరే" అన్నాను గత్యంతరంలేక.

ఇంకోసారి ఛస్తే కాలనీ కమిటీ పదవులే మాత్రం ఒప్పుకోకూడదని అప్పటికప్పుడే నిర్ణయించుకున్నాను.

శాయీరామ్ వెళ్ళిపోగానే– నేను రెడీ అయి మీటింగ్ జరిగే చోటుకి చేరుకున్నాను. అప్పటికే శాయీరామ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కాబట్టి తానే దగ్గరుండి వేదిక, మైక్, షామియానాలు అన్నీ ఏర్పాటు చేయించేశాడు.

ఎనిమిదింటింకి కాలనీలోని వాళ్ళు చాలామంది మీటింగ్ కొచ్చేశారు.

"కాలనీ ప్రెసిడెంట్ గోపాల్రావ్‌గారు ముందు మాట్లాడుతారు." అన్నాడు శాయీరామ్ మైక్ దగ్గర నిలబడి.

గోపాల్రావ్ మైక్ దగ్గరకొచ్చాడు.

"సోదరులారా! ఉన్న పార్టీలతోనే మనమందరం నానా ఇబ్బందులూ పడుతూంటే గోరు చుట్టుపై రోకటిపోటులా ఇప్పుడు కాంగ్రెస్ (జడ్) అవతరించింది. ఆ పార్టీ తాలూకా అభ్యర్థి నిన్నే మన కాలనీకొచ్చి మనం ఆయనకే ఓట్లువేస్తే మన కాలనీలో ప్రతి ఇంటికీ ఓ ఇత్తడి బిందె ఇస్తానన్నాడు. కనుక మనం ఇప్పుడు పరిస్థితిని సమీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది."

"ఇత్తడి బిందె ఏ సైజుది?" ఎవరో ఒకామె ఆడవాళ్ళలో నుంచి అడిగింది.

"సైజు వివరాలు ఆయనింకా అందజేయలేదని నేను మనవి చేస్తున్నాను."

"మిగతా పార్టీలవాళ్లు ఏమంటున్నారు?" మరొకావిడడిగింది ఆశగా.

"మిగతావాళ్ళల్లో కాంగ్రెస్ (డబ్ల్యూ) వాళ్ళు అదివరకు లాగానే ప్రతి ఓటుకి ఓ చెంచా

ఫ్రీగా ఇస్తారు. ఇక టిడిపి (ఎక్స్) వాళ్ళు ప్రతి ఇంటికి ఓ ప్లాస్టిక్ బకెట్ ఇస్తామంటున్నారు. టిడిపి 'క్యూ' వాళ్ళు ప్రతి ఇంటికీ ఓ అమెరికన్ బ్రాయిలర్ చికెన్ ఇస్తారట. ఒకవేళ ఎవరయినా కోడి తిననివారుంటే వాళ్ళకి కోడికిబదులుగా కోడిగుడ్లు ఇచ్చేస్తారు. కాంగ్రెస్ (జి) వాళ్ళు ప్రతి ఓటరుకి పదకొండు గాలన్ల గుడంబా పోస్తారట కనుక..."

అతనిమాట పూర్తికాకుండానే సావిత్రమ్మలేచి నిలబడింది.

"మిగతా పార్టీలు ఇస్తామంటున్న సామాన్లన్నీ ఇదివరకు ఎలక్షన్లలోనే సమకూర్చుకున్నాం. ఇంతవరకూ ఎవరూ ఇత్తడి బిందె ఇవ్వలేదు. కాబట్టి మన ఓటు కాంగ్రెస్ (జెడ్) కే వేసేద్దాం."

దాంతో అంతా రణగొణధ్వనులు మొదలయ్యాయ్.

"ఆ బిందెసైజు తెలుసుకోందే మాటెలా ఇస్తాం?" అని ఒకరు.

"నా చీరలన్నీ బొత్తిగా చిరిగిపోయాయి పిన్నిగారూ! బిందె బదులు నాలుగు చీరలిమ్మంటే ఇవ్వరంటారా" అని ఇంకోకావిడ.

"కిందటిసారి వాళ్ళిచ్చిన స్టీలు చెంచాలు తుప్పు పట్టిపోయాయి. ఆ సచ్చినోళ్ళని ముందా చెంచాలు వాపను తీసుకుని మంచివి ఇమ్మని కబురు చేయండి" అని ఇంకొకావిడ.

ఈ రణగొణ ధ్వనిలోంచి ఒకావిడ కంఠం ఖంగుమనిమోగింది.

"అన్ని వస్తువుల ధరలూ పెరిగిపోయాయి! ఇంకా ఈ బిందెలూ, చీరలూ, చెంచాలు ఏమిటి! నా మొఖం! టి.వి. సెట్లుగానీ, స్టీలు ఆల్మారాలుగానీ ఇవ్వమని అడగరాదూ?"

"అవునవును. ఎంతకాలం ఈ చిల్లరబేరాలు?" ఇంకెవరో సపోర్టుచేశారు.

నేను గొంత సవరించుకున్నాను.

"అంతఖరీదయినవి ఎవరిస్తారు? ఒక్కో ఇంటికి ఓ టి.వి. సెట్టంటే చూడండి మరీ-- కనీసం రెండుకోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి ఉంటుంది వాళ్ళకి. అదెలా సాధ్యం?" అన్నాను నచ్చచెప్తూ.

"ఏం మాయరోగమేమిటి? స్టాంపుల కుంభకోణాల్లోనూ, ప్రభుత్వ భూముల కుంభకోణాల్లోనూ ఇంకా ఇతరత్రా ఇంతకు పాతికరెట్లు సంపాదించుకోరా." విరుచుకుపండిందొకావిడి.

"సంపాదించుకున్నాగానీ- వాళ్ళు ఖర్చుచేయరు-" నన్ను సమర్థిస్తూ అన్నాడు గోపాల్రావ్.

"చేయకపోతే పోనీండి. మన ఓటు కూడా వాళ్ళకేయం" అందామెమొండిగా.

ఆడాళ్ళతోనూ పోలీసులతోనూ ఎప్పుడూ వాగ్వివాదం పెట్టుకోకూడదని మా గోపాల్రావ్ చెప్పిన విషయం నాకు గుర్తుంది. అంచేత ఆ విషయం శాయిరామ్‌కి కూడా గుర్తుచేశాను.

అతను వెంటనే సైలంటయిపోయాడు.

ఈలోగా ఓటాక్సీ వేగంగా వచ్చి ఆగిందక్కడ. అందరం ఆశ్చర్యంగా అటువేపు చూడసాగాం. టాక్సీలోంచీ మా కాలనీలోనే ఉంటున్న శ్యామ్రావు ఖద్దరు చొక్కా పంచెతోదిగి చిరునవ్వుతో మా అందరికీ నమస్కారం చేశాడు. అందరికీ మతిపోయినట్లయింది ఆ అవతారం చూసి.

"శ్యామ్రావ్‌గారికి జై" అంటూ వెనుకే వాళ్ళ పెద్దబ్బాయి కూడాదిగాడు.

శ్యామ్రావ్ చిరునవ్వుతో వేదిక మీదకు వచ్చి నిలబడి జనార్ధన్‌తోనూ, శాయిరామ్‌తోనూ, నాతోనూ కరచాలనం చేశాడు.

"తమరు అనుమతిస్తే నా ఓటర్లకు ఓ అభ్యర్ధన చేస్తాను" అన్నాడు చిరునవ్వుతో.

"మీ ఓటర్లేమిటి?" ఆశ్చర్యంగా అడిగాడు జనార్ధన్.

"మీరంతా నా నియోజకవర్గంలోని ఓటరులే కదా! కనుక మన కాలనీ ఓట్లన్నీ నాకే వేయడం న్యాయమని మనవిచేస్తాను" చిరునవ్వుతో అన్నాడు.

ఆ చిరునవ్వు చూస్తూంటే నేను చూస్తున్నది కలో నిజమో అర్ధంకావటంలేదు నాకు. నేను ఆ కాలనీగత పదేళ్ళుగా ఉంటున్నాను. ఈ పదేళ్ళలో ఏ ఒక్కరోజు కూడా అతను నవ్వటం ఎవ్వరూ చూడలేదు.

"అంటే... అంటే... మీరూ ఎలక్షన్‌లో...."

"అవున్నాయనా! మన నియోజకవర్గం నుంచేపోటీ చేస్తున్నాను." అప్పుడే పుణ్యక్షేత్రాలన్నీ సందర్శించి వచ్చిన పెద్దమనిషిలా శాంతంగా అన్నాడతను

మా సంభాషణ అంతా మైకులో అందరికీ వినబడుతూండడంవల్ల సభలో కలకలం బయల్దేరింది.

"సోదరులారా! మీకు నన్ను నేను పరిచయం చేసుకోవాల్సిన అవసరంలేదని నాకు తెలుసు. ఎందుకంటే నేను మీ వాడిని. మీలోపుట్టి పెరుగుతున్న మన కాలనీవాడిని, ఎలక్షన్లో నేను కూడా ఎమ్మెల్యేగా పోటీచేస్తున్నానని మీకందరకూ తెలియజేయడానికి ఎంతో సంతోషిస్తున్నాను. నిజానికి నాకసలు రాజకీయాలంటే మీ అందరిలాగానే చిరాకు. కానీ ఈ రోజున మనదేశంలో అస్తవ్యస్త పరిస్థితులు చూశాక గుండెద్రవించిపోయి ఒక్కదూకుదూకాను. కనుక నన్ను మీరందరూ తప్పక ఎన్నుకుంటారని ఆశిస్తున్నాను. నన్ను ఎన్నుకుంటే 159 నెంబర్ బస్‌ని కాలనీలోపలి వరకూ లాక్కొస్తారు. పైప్స్‌లో మంచినీళ్లు దొరికే టైముని అర్ధరాత్రి నుంచి ఉదయం మూడింటికి మార్చేస్తాను. మన కాలనీలో ఉన్న పిచ్చికుక్కల్ని పక్కకాలనీలోకి తరిమేయిస్తాను" ఆగాడతను.

"ఇంతకూ మీరేమిస్తున్నారు మరి? బిందెలా, చీరలా?" సావిత్రమ్మ అడిగింది మధ్యనుంచి.

"అమ్మా, మీకో నమస్కారం నాకు అంతటి తాహతులేదు, నేనేమీ ఇవ్వలేను."

"మరి అవతలివాళ్ళు ఇవ్వన్నీ ఇస్తుంటే ఎవరొదులుకుంటారు?"

"అయ్యో! వదులుకోమని ఎవరన్నారమ్మా? ఎవరేమిస్తే అది తీసుకోండి. ఎలక్షన్లుండగానే ఇల్లు చక్కబెట్టుకోమన్న సామెత ఉండనేవుంది గదా! అందరి దగ్గరా అన్నీ తీసుకుని ఓటు మాత్రం నాకు వేయండి. నాలాంటి బీదాడికి ఓటుదానం చేస్తే ఎంతో పుణ్యం మీకు. దానాలన్నిటిలోకి 'ఓటుదానం' గొప్పదని మన శాస్త్రాలు ఘోషిస్తున్నాయి కదా."

అందరూ చర్చించుకోవడం మొదలెట్టారు. చర్చముగిసే వరకూ అతను నమస్కారం పెడుతూ అలాగే ఉండిపోయాడు.

చివరకు అందరూ కలిసి శ్యామ్రావుకే ఓటువేయాలన్న నిర్ణయానికొచ్చారు.

ఆ నిర్ణయం విన్నవెంటనే శ్యామ్రావు ఆనందంతో పొంగిపోయాడు.

"నాకు చాలా సంతోషంగా ఉంది. మన కాలనీ ఓట్లంటే మాటలు కాదు. సుమారు అయిదువేల ఓట్లు. నేనింక ఎలాంటి ఢోకాలేకుండా గెలుస్తాను. నమస్తే నమస్తే" అంటూ నమస్కారాలు చేసుకుంటూ టాక్సీ దగ్గరకు వెళ్ళాడు. వెనకే అతని కొడుకు "శ్యామ్రావ్‌గారికి జై" దేశ్‌కీ నేతా – శ్యామ్రావ్ బన్‌తా" "ఇండిపెండెంట్ అభ్యర్థి శ్యామ్రావ్ జిందాబాద్–" అని అరుచుకుంటూ వెళ్ళాడు.

టాక్సీ వెళ్ళిపోగానే గోపాల్రావ్ మళ్ళీ మైకు దగ్గరకొచ్చాడు.

"కాలనీ వాళ్ళందరం కలసి శ్యామ్రావ్‌గారికే ఓటు వేయాలని నిర్ణయించడం నిజంగా చాలా గొప్పవిషయం. శ్యామ్రావుగారు డబ్బుకి బీదాడేగాని చదువులో కాదు. ఆయన రెండుసార్లు బి.ఏ. పాసయ్యారు. ఒకసారి కార్పొరేషన్ ఎలక్షన్లో నుంచుని ఓడిపోయారు. గనుక రాజకీయ అనుభవం కూడా వుంది."

అతనలా మాట్లాడుతూండగానే మరో అరడజను టాక్సీలు వచ్చి ఆగాయ్ అక్కడ. మొదటి టాక్సీలో నుంచి ఎర్ర టర్కీబనీనూ, పచ్చపాంటూ వేసుకున్న నల్లని లావుపాటి ఆకారందిగింది. ఆ ఆకారం వెనుకే మరికొన్ని ఆకారాలు పంచరంగుల బనీన్లు, దుబ్బు జుట్టూ, చేతుల్లో కత్తులూ చైన్లతో దిగారు. ఒక్కొక్కరే రొమ్ము విరుచుకుని నడుస్తూ అక్కడషామియానాలో ఉన్న మాకు గస్తీ పోలీసుల్లా నిలబడ్డారు.

"ఈ కాలనీ ప్రెసిండెటెవళ్ళువయా ఈడ?" అంటూ ఓ పచ్చ బనీను నా దగ్గరకొచ్చి అడిగాడు.

"ప్రెసిడెంటా- అదుగో-వారే!" అంటూ గోపాల్రావుని చూపించాను.

"ఏయ్ ప్రెసిడెంటూ- జరా బయటకొచ్చి శంకర్‌దాదాని కలువ్!" అన్నాడతను జనార్ధన్‌తో.

"శంకర్‌దాదానా!" ఉలిక్కిపడి గోపాల్రావ్.

"అవ్!"

అందరం మొఖాలు చూచుకున్నాం.

శంకర్‌దాదా అంటే మా ఏరియాలో తెలీనివారు లేరు. వాడుచేసే కిరాతకాలు అందరికీ తెలుసు.

ఎప్పుడూ తన గాంగ్‌ని వెంబడేసుకుని రోడ్లమీద అడ్డుపడ్డవాడినల్లా పొడుస్తూ- ఉంగరాలు, గడియారాలు, డబ్బులాక్కుపోవడం, పండుగ మామూళ్ళు కత్తిచూపి వసూలు చేయటం చాలా మామూలు విషయం.

"ఇప్పుడు... నా.... నా.... నా.... తో ఏమిటి ప... ప... ప.. పని? ఖంగారుగా అడిగాడు గోపాల్రావ్.

"గట్ల పరిషానెందుకవుతున్నావ్- శంకర్‌దాదా జర్ర నీతో మాట్లాడాల్నని వచ్చిండువయా- నడుమళ్ళా!"

"అలాగే-పదండి! మీరు కూడారండి వెళ్దాం!" అన్నాడు గోపాల్రావ్ మా వంక చూస్తూ, ముగ్గురం కలిసి శంకర్‌దాదా దగ్గరకెళ్ళాం

"నమస్కారమండీ? నేనే గోపాల్రావ్‌ని" వినయంగా అన్నాడు గోపాల్రావ్.

"నమస్తే అన్నా! నిన్ను కలవాలని నాల్గుదినాల కెళ్ళి కోషిష్ చేస్తున్న!" అని షేక్‌హాండిచ్చి నావంకచూసి "నువ్వెవళు?" అనడిగాడు.

"నాపేరు ఉదయార్కర్!"

"నీ పేరు గాదువయ్యా అడిగేది- నువ్వెవళు అనడుగుతున్న!"

"అదా- అదీ- నేను కాలనీవైస్ ప్రెసిడెంట్‌నండీ!" వినయంగా అన్నాడు గోపాల్రావ్

"నీ యవ్వ- గట్ల చెప్పరాదువయ్యా! నాకు తెలీకనేపాయె. ఏదీ- చెయ్ కలుపు-" అంటూ చేయిజాపాడు.

అయిష్టంగానే కరచాలనంచేశాను.

"నేను కాలనీ కమిటి ఆర్గనైజింగ్ సెక్రెటరీనండీ!" ఎందుకయినా మంచిదని అడగకముందే చెప్పేసుకున్నాడు శాయీరామ్.

"నీయవ్వ- మంచిగయింది- అందరు ఈడనే జమయిన్రు! చెయ్ కలుపు" అంటూ శాయీరామ్‌తో కూడా కరచాలనం చేశాడు.

"అదిసరేగానీ, నేనిప్పుడు ఈడకి ఎందుకొచ్చినానో ఎరుకనా?" అడిగాడతను.

"తెలీదండీ!"

"నేను ఎలక్షన్ల ఎమ్మేల్లేగా నిలబడినా- సమజయిందా! అగో- ఆ పని మీదనే ఈడకొచ్చినా! మీరు నాకు జర్ర మదద్ చేయండ్రి! మీ కాలనీ ఓళ్ళందరూ- మీ మాటకు ఇజ్జతిస్తరని మా గాంగోళ్ళుచెప్పిన్రు!" ముగ్గురం షాక్ తిన్నట్లయిపోయాం!

"అలాగేనండీ అందరికీ చెప్పి తప్పక మీకే వేయిస్తాము-" అన్నాడు గోపాల్రావ్ షాక్నుంచి త్వరగా తేరుకుని.

"అయితే నడుమల్లా! మైక్ల నేను గూడ జరమాట్లాడ్నికి కోషిష్చేస్త!" అంటూ మైక్ దగ్గరకు నడవసాగాడు. ముగ్గురం అతని వెనకే నడిచాము.

"సోదర సోదరీమణులారా, ప్రస్తుతం అర్జంటుగా ఓ విషయం మనవి చేయదల్చుకున్నాను. మన నియోజకవర్గం నుంచి శంకర్దాదా కూడా పోటీ చేస్తున్నట్లు ఆయనే స్వయంగా ఇక్కడికొచ్చి తెలియజేశారు. శంకర్దాదా గురించి నేను మీకు చెప్పాల్సిందేమీలేదు. ఆయన పేరు చిన్నపిల్లల క్కూడా తెలుసు. కనుక మన ఓట్లన్నీ ఆయనకే వేయాలని ఆయన కోరుతున్నారు. ఇప్పుడు శంకర్దాదా మాట్లాడతారు" అనేసి పక్కకకు జరిగాడు శాయీరామ్.

శంకర్దాదా మైక్దగ్గరకొచ్చి అందరికీ నమస్కారం పెట్టాడు.

"ఈడున్నోళ్ళందరికీ సలాం జెప్తున్న! శాయిరామ్ అన్న నా గురించి మీకు మంచిగా చెప్పిండు. ఈడున్నోళ్ళల్ల కొంతమంది సోంచాయిస్తుండొచ్చు. దాదాగిరీ చేసేటోడు- ఎమ్మేల్లేగ ఎట్ల నిలబడ్డాడు అని. నిజంవయ్యా, నేను మర్డర్లు చేసినా, దొంగతనం జేసిన, జైలుకెల్లిన, రేప్లు చేసిన కానీ ఇన్నిదినాలు మనదేశం పరిపాలించేటోండ్లలో ఇవన్నీ చెయ్యనోళ్ళెవళు వయా? మంచిగా సోంచాయించండ్రి! ఇయ్యాల్రేపు పేపర్లలో చూస్తున్రు గదా. దొంగ సిమ్మెంటమ్ముకునేటోడొకడు, ప్రభుత్వం భూములమ్ముకునేటోడొకడు, దొంగస్టాంపుల మ్మేటోడొకడు. డాక్టర్ల కొలువులమ్ము కునేటోడొకడు- గిట్ల మినిష్టర్లందరూ దందాలు జేస్తున్రు. గసంటోళ్ళకు ఓట్లువేస్తారువయ్యా? నన్ను గిట్ట గెలిపించిన్రంటే- ఖసమ్తోటి జెప్తున్న- నేను ఈ మర్డర్లు చేసెడిది- దొంగతనాలు, రేప్లు చేసెడిది- అన్నీ ఇడచిపెడత! ఏం జెప్తున్న? సమజయిందా. ఇంక నేను పోవాల్నామల్లా?"

ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు. అందరూ భయంతో గుడ్లప్పగించి చూస్తుండిపోయారు.

"అచ్చామైజారవూ అన్నా. ఈళ్ళందరితో ఓట్లెయిపించే జుమేదారిమీది. ఏమంటున్న? నాల్గుదినాలు అయినాక వస్తమల్లా." అనేసి వెళ్ళిపోయాడతను. మరుక్షణంలో టాక్సీలన్నీ వెళ్ళిపోయినయ్.

"ఏమిటి? రౌడీ వెధవకు మనం ఓట్లెయ్యాలా? అయ్యో ఏంకాలమొచ్చింది" ఒకావిడ అంటోంది.

"ఇలా ఎవడు బడితే వాడే నిలబడితే ఎలా?"

"మన కాలనీలో అందరూ గ్రాడ్యేట్లు, పోస్ట్‌గ్రాడ్యేట్లు ఉండి- అందరూ కలసి అక్షరం ముక్కరాని రౌడీకా ఓట్లు వేసి గెలిపించడం-" ఇలా రకరకాల వ్యాఖ్యలు గుప్పుమని చెలరేగాయి. శంకర్‌దాదా వెళ్ళిపోగానే శాయీరామ్ మైక్‌దగ్గరకొచ్చాడు.

"సోదర సోదరీమణులారా, ఇప్పుడు అనుకోని పరిస్థితి ఎదురయింది మనకి. శంకర్‌దాదా ఓట్లు తనకే వేయమని వార్నింగిచ్చాడు. వేయకపోతే ఏం జరుగుతుందో మనందరం తేలిగ్గా ఊహించవచ్చు. వాళ్ళ గాంగ్ వాళ్ళందరూ కత్తులు తీసుకుని మన కాలనీ అంతా స్వైరవిహారం చేసేస్తారు. అంచేత మనం ఇంతకుముందు శ్యామ్రావుగారి కిచ్చినమాట ఉపసంహరించుకుందాం, ఏమంటారు?"

యాదగిరి లేచి నిలబడ్డాడు.

"మీ రూరికే పరిషానవుతున్నారుగానీ మనం వాడికి వోటు వేయలేదన్న విషయం శంకర్‌దాదాకెట్లా తెలుస్తుందివయ్యా?

"పిచ్చాడిలాగున్నావ్- మనలో కాలనీ పక్కనున్న పోలింగ్‌బూత్‌లో వోట్లు లెక్కట్టేప్పుడు తెలీదూ?"

"తెలిస్తే ఏం జేస్తాడంటావ్?"

"కత్తులు- స్వైరవిహారం- మనలో వెయ్యిమందికి కత్తిపోట్లు, పాతికమంది దుర్మరణం- ఇలా సాగిపోతుంది ఆ మర్నాడు పేపర్లో వార్త." అన్నాడు రంగారెడ్డి.

అందరూ నిశ్శబ్దం అయిపోయారు. మీటింగ్ అర్ధంతరంగా ముగిసిపోయింది.

"సోదరులారా, తిరిగి మనందరం వచ్చే ఆదివారం ఇక్కడ కలుసుకుని ఎవరికివోటు వేయాలో ఫైనల్‌గా నిర్ణయించుకుందాం" అన్నాడు శాయీరామ్.

అందరూ ఎవరిళ్ళవాకు వాళ్ళు బయలుదేరారు.

నాల్రోజులన్నా అవకముందే కాలనీవాళ్ళందరూ బలవంతంగా అర్ధరాత్రి సమావేశం జరపాల్సివచ్చింది. అందుక్కారణం సిరాజుద్దీన్ అనే అభ్యర్థి. అతగాడు తన తాలూకూ వందమంది అనుచరులతో కాలనీని చుట్టుముట్టి అందరికీ కర్రలుచూపి లాక్కొచ్చారు. శాయీరామ్ కళ్ళను లుముకుంటూ సమావేశం ప్రారంభించాడు.

"సోదరులారా! మన నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న అభ్యర్థి శ్రీసిరాజుద్దీన్ గారి విన్నపం వల్ల- మనం అర్జంటుగా....

"విన్నపం గాదువయ్యా- జబర్దస్తే చేసినా! గట్ల చెప్పనికి భయమేమున్నది చెప్పు" అన్నాడు సిరాజుద్దీన్ పౌరుషంగా.

"ఆ! అదే బలవంతంగా మనల్నిక్కడ సమావేశపరచడానికి కారణం ఏమిటంటే మన కాలనీ వాళ్ళందరూ ఆయనకే ఓట్లు వేయాలని ఆయన అభ్యరిస్తున్నారు."

"ఇగో- గదే గలత్‌మాట! నాకేం గర్జ్‌వయ్యా బతిమాలానికి? బజర్దస్త్ జెప్తున్న. పూరా వోట్ నాకే ఎయ్యాల్న! ఏమంటున్న? ఎయ్యకుంటే కత్తితో కిరికిరవుతది! సమజయిందా?"

"ఆ, అయింది సార్? ఇంత క్లియర్‌గా చెప్పాక ఇంక అర్ధమవకుండా ఎలా ఉంటుంది?"

"అయితే నా గురించీ, నేనంతకు ముందు చేసిన ప్రజాసేవ గురించి కూడా చెప్పు ఆళ్ళకు" అన్నాడు సిరాజుద్దీన్.

"సోదరులారా! సిరాజుద్దీన్‌గారి గురించి మీకు వేరే చెప్పనవసరం లేదు. ఆయన కూడా చిన్నప్పటి నుంచీ జైలు కెళ్తూనే వున్నారు. ఈ రోజున కూడా నిజానికి జైల్లోనే ఉండాల్సింది గాని మన ఓట్లకోసం జామీను మీద వచ్చారు. ఆయన అంతర్రాష్ట్రీయ జేబుదొంగ అన్న విషయం మీరు పేపర్లలో చూసేవుంటారు! లేదా అనుభవ పూర్వకంగానయినా గ్రహించివుంటారు. కేవలం తనొక్కడే సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ స్కీముక్రింద ప్రారంభించిన 'పిక్ పాకెట్' సంస్థ. నేడు అనేక వేల మంది సభ్యులతో కిటకిటలాడిపోతోంది. అప్పుడు సంవత్సరానికి పాతికవేలు టర్నోవర్ ఉంటే ఇప్పుడది ఇరవై కోట్ల రూపాయలకు చేరుకుంది. "సిరాజుద్దీన్‌గారిది మంచి మనసు" అనడానికి నిదర్శనం ఆయన ఆ సంస్థ ద్వారా ఎంతో డబ్బు ఇంకా సంపాదించే అవకాశం ఉన్నా- ఆ వృత్తిని మానేయడం! నిజంగా ఎంతో గొప్పవిషయం ఇది. కామధేనువు లాంటి వృత్తినెవరయినా వదులుకోగలరా- ఒక్క సిరాజుద్దీన్‌గారు తప్ప."

అందరూ తప్పట్లు కొట్టారు.

"ఇగో- తాలీ జబాయించితే నేను ఖుష్ అవుతాననుకోకండ్రి. కాలనీలోని ఓట్లన్నీ నాకేపడాల్న! ఇయాల్టినుంచి ఈ కాలనీలోకి ఇంకెవళ్ళూ రాకుండా మా షాగిర్దీల్ని పహరాపెడ్తన్న! ఇంకెవళ్ళమాటా ఇనకండ్రి. ఇంకెవళ్ళకీ వోటెయ్యకండ్రి. సమజయిందా?"

"అయింది" అన్నాయి కొన్ని గొంతులు.

"ఇకపోండ్రి! ఓట్ల ఇసయంల నకరాలు చేస్తే మాత్రం కత్తితో కిరికిరవుతది" సిరాజుద్దీన్ వెళ్ళిపోయాడు.

అతని శిష్యులు ఇద్దరు మాత్రం అక్కడేగస్తీ తిరగసాగారు. అందరం నిశ్శబ్దంగా ఎవరిళ్ళకు వాళ్ళు చేరుకున్నాం.

అదివారం రానేవచ్చింది.

కాలనీ వాళ్ళందరూ సమావేశానికి హాజరయ్యారుగానీ ఎవరిమొఖాన్నా కళలేదు. ఎవరూ బిందెల గురించీ, స్టీలు గిన్నెల గురించీ, చీరలగురించీ మాట్లాడటం లేదు.

"సోదర సోదరీమణులారా! ఎవరెంత బెదిరించినా మన కాలనీ ఓట్లన్నీ కొద్దోగొప్పో చదువూ సంస్కారమున్న శ్యామ్రావ్‌గారికే వేయాలని అందరూ అభిప్రాయం వెలిబుచ్చారు" అని గోపాల్రావ్ చెప్పగానే అంతటా తప్పట్లమార్మోగిపోయాయ్. సరిగ్గా అప్పుడే టాక్సీలోంచి దిగాడు శ్యామ్రావ్.

ఆయన వెనుకే ఆయన కొడుకు "ఈరిగాడూ జిందాబాద్" అని అరుస్తూ మా మధ్యకొచ్చాడు.

అందరూ నిర్ఘాంతపోయారు. శ్యామ్రావ్ చిరునవ్వుతో మాట్లాడసాగారు.

"సోదర సోదరీమణులారా! నేను కాంగ్రెస్ (జడ్) అభ్యర్థి అయిన ఈరిగాడినే బలపరుస్తూ పోటీ నుంచి విరమించుకుంటున్నాని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. కనుక మీ అందరి ఓట్లు కూడా ఈరిగాడికే వేస్తారని ఆశిస్తాను." అనేసి నమస్కారం చేసి వెళ్ళిపోయారు.

అందరూ మొఖాలు పాలిపోయాయ్.

"మోసం, దగా ఈరిగాడి దగ్గర లక్షరూపాయలు కొట్టేసి విత్‌డ్రా అయిపోయాడు" అన్నాడు రంగారెడ్డి.

"ఆ! లక్షరూపాయలు కొట్టేశాడా?" అరిచారు అందరూ.

"అవును. నిన్న ఈరిగాడి మనుషులే స్వయంగా చెప్పారుగాని నేను నమ్మలేదు" కొద్దిసేపు అంతా కోలాహలంతో నిండిపోయింది.

కేవలం లక్షేకాదు. ఎలక్షన్‌లో నిలబడ్డ ప్రతి అభ్యర్థికీ గవర్నమెంటు ఇచ్చే న్యూస్‌ప్రింటూ, పెట్రోలూ, వోటర్స్‌లిస్ట్‌లు, టెలిఫోన్ సౌకర్యం ఇవ్వన్నీకూడా శ్యామ్రావ్ గారు బ్లాకులో అమ్ముకుని పది లక్షల రూపాయల వరకూ సంపాదించాడని, ఆ తరువాత ఆయనకొన్న ఇల్లూ చేసిన కూతురి పెళ్ళీ ఋజువుచేశాయ్.

కొద్దిసేపు అంతా కోలాహలం–

"ఇంతకూ ఇప్పుడు మన ఓటు ఎవరికి?" అడిగారు కొందరు.

"ఈరిగాడికే వేస్తే సరి" నేను సలహా ఇచ్చాను.

"నీకెంత ఇచ్చాడు వాడు?" ఎవరో అరిచారు. నేను సైలెంటయిపోయాను.

"ఈరిగాడా! వాడుచేసేది సారావ్యాపారం. కల్తీసారాతో ఆ మధ్య అరవైమంది నిటపా కట్టించాడు. వాడు ప్రజాప్రతినిధా?"

"వద్దు-వద్దు" అని అరిచారు కొంతమంది స్త్రీలు.

"పోనీ కాంగ్రెస్ (క్యూ) అభ్యర్థి అంగముత్తుకి వేద్దామా?"

"వాడికా! వాడు రోడ్డుమీద కనబడ్డ ఆడాళ్ళ మంగళసూత్రాలు లాక్కుని పారిపోతాడు కదా!"

"పోనీ కాంగ్రెస్ (పి) అభ్యర్థి సంగతేమిటి?"

"వాడికసలు చదువేలేదుగా! బండిలో కూరగాయలమ్మేవాడు!"

"అయితే ఇండిపెండెంట్ రామ్‌సింగ్ మాటేమిటి."

"వాడా? వాడి దగ్గర నుంచీ మొన్నేగా పోలీసులు స్మగుల్డ్ సామాను పట్టుకుందీ?"

దాంతో జనార్ధన్‌కి చిరాకేసుకొచ్చింది.

"సోదరులారా! ఇలా అందరికీ వంకలు పెట్టం నాకేం నచ్చలేదు. మనదేశంలో ఎలక్షన్‌లో నిలబడేవారందరూ ఇంచుమించుగా ఇలాంటివారే! వాళ్ళలోనే మన ఓటు ఎవరొకరికి వేయకతప్పదు" అన్నాడు విసుగ్గా.

అందరూ మళ్ళీ తర్కంలో పడ్డారు.

చివరకు అందరూ కలిసి గోపాల్రావుకే ఆ బాధ్యత అంటగట్టారు.

మా నియోజకవర్గంలో నిలబడ్డవారందరిలోనూ ఎక్కువ చదుకున్నవాడూ, తక్కువ మర్డర్‌లూ, రేప్‌లూ, జేబుదొంగతనాలూ, స్మగుల్డ్ వ్యాపారం చేసేవాడూ అయిన అభ్యర్థిపేరు సూచించాల్సిందిగా ఆదేశించారు.

వాళ్ళ ఆదేశం మేరకు మేము ముగ్గురం అన్ని పోలీస్‌స్టేషన్లకూ వెళ్ళి అతి తక్కువ నేరాలు చేసిన అభ్యర్థి పేరు గాలించి విజయం సాధించాం!

మా నియోజక వర్గంలో పోటీచేస్తున్నవాళ్ళందరిలోకీ శంకర్‌దాదా ఒక్కడే అందరికంటే ఎక్కువ చదువుకున్నాడు (రెండోక్లాసు). అలాగే అతనొక్కడే అతి తక్కువ మర్డర్లుచేశాడు. (రెండొందల ఆరు) అతి క్కువ రేప్‌లు చేసింది కూడా అతనే (పదహారు). అతి తక్కువ కాలం జైల్లో ఉన్నది కూడా అతనే (ఆరేళ్లు) మరి చూస్తూ చూస్తూ వాడికెలా ఓట్లువేస్తాం? కానీ ఓ పక్క శంకర్‌దాదా కత్తులతో కాలనీ అంత స్వైరవిహారం చేసే దృశ్యంకూడా మా కళ్ళ ముందు కనబడుతోంది. చివరకు ఎవరికీ వోటు వేయకూడదని నిర్ణయించుకున్నాం.

అయితే ఈ విషయం ఎలా తెలిసిందోగాని సిరాజుద్దీన్‌కి తెలిసింది. ఆ రాత్రి అతగాడు మా కాలనీకొచ్చి అందరినీ అర్జంటుగా బయట సమావేశపరచేశాడు.

"ఖబడ్దార్! వోట్లు నాకేస్తామని వాదాచేసి గిప్పుడు పల్టాయించి పోతారు? నీయవ్వ- మీకు మంచిగా బుద్ధిజెప్త! నేనెసుంటోడ్నో మీకెరుకలేదు!" అంటూ వార్నింగిచ్చాడు.

ఎవ్వరం మాట్లాడలేదు.

"అగో! మాట్టాడరు? సరే బిడ్డా! నేన్ జూసుకుంట! పదండ్రి!" అనేసి కోపంగా అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి ఎవ్వరికీ నిద్రలేదు. భయం!

తెల్లారుజామున ఎవరో కెవ్వున కేకలు పెట్టేసరికి అందరం ఉలిక్కిపడిలేచి బయటకు పరుగెత్తాం!

తీరాచూస్తే శాయిరామ్‌కి కలవచ్చిందట– తనని సిరిజుద్దీన్ చంపుతున్నట్లు– అందుకని వెర్రికేకలు పెట్టాడట

ఎలాగోలా తెల్లారింది.

అందరం వోటింగ్ చేయడానికి బయలుదేరాంగానీ కాలనీ బయట సిరాజుద్దీన్ శిష్యులు కర్రలు తీసుకుని నిలబడి కనిపించారు.

"ఏయ్! సాయంత్రం వరకూ కాలనీ వోళ్ళెవరూ బయటకు రాకండ్రి! వచ్చిన్రో కిరికిరవుతది!" అన్నారు బెదిరింపుగా.

వాళ్ళతో గొడవెందుకని అందరం మళ్ళీ ఇళ్ళల్లోకొచ్చేశాం.

తీరా మధ్యాహ్నం రెండవుతుండగా కాలనీ అంతా శంకర్‌దాదా తాలూకా రౌడీలు నిండిపోయారు.

"నీ యవ్వ! మంచిగ చెప్తె ఇనరుబే? లేండ్రి! నడవుండ్రి వోట్లెయ్యనికి!" అంటూ అరవసాగారు.

"అయ్యా, ఓట్లేస్తే సిరాజుద్దీన్ మమ్మల్ని చంపుతానంటున్నాడండీ" అన్నాడు జనార్ధన్.

"ఇగో– ఇదంతా మాకు తెల్వదు– మంచిగ చెప్పినాం. ఇనకుంటే మీదే జుమేదారి" అనేసి వెళ్ళిపోయారు వాళ్ళు.

సాయంత్రం మూడవుతుండగా మళ్ళీ కాలనీవాళ్ళందరం అత్యవసరం సమావేశం జరిపాం.

"ఆ రౌడీ వెధవల్తో ఎందుకొచ్చింది? వెళ్ళివాడికే వేసేద్దాం పదండి" అన్నాడు శాయిరామ్.

చూస్తూ చూస్తూ వాడినా ఎన్నుకునేది?" అన్నారొకరు.

"మనచేత్తో మనమే కళ్ళుపొడుచుకుంటామా?" అందింకొకావిడ. గోపాల్రావ్ రెండుచేతుల్తో తల పట్టుక్కూచున్నాడు.

మరో అరగంట తర్వాత నాకో అయిడియా వచ్చింది.

"సోదరులారా! త్వరగా పోలింగ్‌బూత్ కెళదాం పదండి. వెళ్ళి బాలెట్ పేపరు వెనుక ముద్రవేసి వచ్చేద్దాం దాంతో మన ఓట్లన్ని 'ఇన్‌వాలిడ్' అవుతాయ్ ఎవరికీ వేయలేదన్న

సంతృప్తి మనకూ ఉంటుంది- వాడికే వేశామనివాడు అనుకుని మనజోలికి రాకుండా ఉంటాడు-"

అందరూ నా ఆలోచనకు చప్పట్లుకొట్టారు. కొంతమందీలలు కూడా వేశారు. వెంటనే ఎలక్షన్‌బూత్‌కి ఊరేగింపుగా వెళ్లాం.

కానీ పదినిమిషాల్లో వెనక్కు తిరిగిరావాల్సివచ్చిందిఇ. కారణం అప్పటికే మా ఓట్లు ఎవరో వేసేశారు.

ఆ మర్నాడు రాత్రి మా కాలనీకొచ్చిన పెద్ద ఊరేగింపు చూడ్డానికి అందరం బయటకొచ్చి నిలబడ్డాం! శంకర్‌దాదా పెద్దకార్లో దండల మధ్య నిలబడి అందరికీ నమస్కరిస్తున్నాడు. "శంకర్‌దాదా జిందాబాద్!" అంటూ కేకలు మార్మోగిపోతున్నాయి. అప్రయత్నంగా అక్కడ గుమికూడిన మేముకూడా అరిచాము.

"శంకర్‌దాదా జిందాబాద్!"

